క్లుప్తంగా

సమష్టి కృషితో పనిచేద్దాం



మచిలీపట్నంటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సమష్టి కృషితో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పాటైన వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ విభాగం మచిలీపట్నం నియోజకవర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం స్థానిక గాడెల్లి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పేర్ని కిట్టు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయానికి కృషి చేసేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని కోరారు. మార్కెట్ యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద బాబు (జానీ), వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మత్తే భాస్కర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, కార్యదర్శి కలపాల అనుపమ, జాయింట్ సెక్రటరీ అబ్బూరి యోహాన్, సభ్యుడు కోన డానియేల్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, పాస్టర్లు బేతపూడి పరంజ్యోతి, ఏబేలు, వాల్లస్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ విభాగం నూతన కమిటీ 75 మందితో ఏర్పాటైంది. నియోజకవర్గంలోని మచిలీపట్నం టౌన్ అధ్యక్షుడిగా టీవీ జాషువా, కార్యదర్శిగా అర్జా సురేష్, ఈస్ట్ కమిటీ అధ్యక్షుడిగా ఇందుపల్లి లాజరస్, వెస్ట్ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పులేటి సురేష్ నియమితులయ్యారు.

మత్స్యకారులు పథకాలు వినియోగించుకోవాలి

–ఎఫ్‌డీఓ సత్యనారాయణ

కోడూరు: మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో సోమవారం మత్స్య సహకార సంఘ సభ్యులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సహకార సంఘాలు, రికార్డులు నిర్వహణపై సంఘ సభ్యులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ గురించి మత్స్యకారులు తెలుసుకోవాలని కోరారు. వీటిని ఏర్పాటు చేసుకోవాలనుంటే స్థానిక కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వేట చేసుకునే మత్స్యకారులు విసురు వలలు, తెప్పలు, నావలకు సంబంధించి లైసెన్స్ గురించి సంఘాల సభ్యులు మత్స్యకారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వీఎఫ్ఏలు నరేంద్ర, గోపిరాజు, షేక్ మదర్‌సా పాల్గొన్నారు.

రైతులకు మద్దతుగా ర్యాలీ

బంటుమిల్లి: ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం బంటుమిల్లి పుర వీధుల్లో ట్రాక్టరు ర్యాలీ నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ర్యాలీ చేసి నిరసన తెలిపారు. రైతు సంఘ, సీఐటీయూ జిల్లా, మండల స్థాయి నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, కొల్లాటి శ్రీనివాసరావు, ఎల్. అజయ్‌ఘోష్, బి. నాగరాజు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చల్లపల్లి: భారతదేశ రైతులకు ఇచ్చిన హామీని ఉల్లంఘించిన నరేంద్రమోదీకి ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండే అర్హత లేదని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. ఆలిండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వక్కలగడ్డ నుంచి చల్లపల్లి మీదుగా లక్ష్మీపురం వరకు రైతులు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు యద్దనపూడి మధు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మీర్ రిజ్వాన్, మహమ్మద్ కరిముల్లా, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ



చల్లపల్లి: కరోనా నాటి నుంచి రెండు మురికివాడల్లో నిరుపేద ఎస్టీలకు తమ వంతు సహాయం అందిస్తున్నట్లు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ సెంటరు స్థలంలోని మురికివాడ, విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ఉన్న మురికివాడల్లో జీవిస్తున్న 75 నిరుపేద ఎస్టీ కుటుంబాల వారికి ఐవీఎం ఆధ్వర్యంలో రూ.75 వేలు వ్యయంతో నిత్యావసర సరుకులు అందచేశారు.

మార్చి 10న వైద్య శిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో మార్చి 10వతేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తలశిల రఘుశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షల వివరాల కోసం మొబైల్ నంబర్లు 9490636466, 7093617778 లలో సంప్రదించాలన్నారు.

రామన్నపేట.. అభివృద్ధి బాట

- ఐదేళ్లలో రూ.4కోట్లతో అభివృద్ధి
- ఆదర్శ గ్రామంగా నిలుస్తున్న పల్లె

ఇది కదా.. అభివృద్ధి



రూ.75 లక్షలతో నిర్మించిన గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి

గూడూరు: అది 750 మంది జనాభా ఉన్న చిన్నపల్లెటూరు. అది కూడా మారుమూలన... మండల కేంద్రానికి విసిరేసినట్లు చిట్టచివరన ఉన్న గ్రామం. గత ప్రభుత్వాలు గ్రామాన్ని పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. అడుగడుగునా గోతులతో రాళ్లు లేచిన రోడ్డు కారణంగా గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసును కూడా నిలిపివేశారు. ఎక్కడికైనా వెళ్లాలంటే ఆటో వాళ్లను బతిమాలుకుని తీసుకెళ్లాల్సిందే. అత్యవసర సమయాల్లో అయితే వారి పరిస్థితి అంతే సంగతులు. ఇదంతా గత చరిత్ర. కాలం మారింది. రాష్ట్రంలో పాలన మారింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో నేడు రామన్నపేట రూపురేఖలు మారిపోయాయి. కాలంతో పోటీ పడుతూ అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతుంది గ్రామం. గత ఐదేళ్ల కాలంలో గ్రామం అన్ని వసతులు సమకూర్చుకుంటూ ఆదర్శ గ్రామంగా రూపాంతరం చెందింది.

ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి...:

- రూ.75లక్షలతో గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని పూర్తి స్థాయిలో తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. దీంతో ప్రజల రవాణా కష్టాలు తీరాయి.
- రూ.48లక్షల వ్యయంతో శిథిలావస్థకు చేరిన పీఏసీఎస్ భవనాన్ని తొలగించి పూర్తిస్థాయిలో అధునాతన భవనం, గోదాము నిర్మించారు.
- రూ.22.80లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం జరగటంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, తమ సేవలు అందిస్తున్నారు.
- రూ.40లక్షల వ్యయంతో చేపట్టిన మార్కెట్ యార్డు గోదాము నిర్మాణం వేగంగా సాగుతుంది. నిర్మాణ పనులు ప్రస్తుతం చివరి దశలో ఉంది. గోదాము నిర్మాణం పూర్తయితే రైతులు తాము పండించిన పంటలు నిల్వ ఉంచుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది.
- రూ.1.5 కోట్లతో అంతర్గత రహదారులన్నీ పూర్తి స్థాయిలో సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేయడంతో గ్రామంలో గోతుల రోడ్లకు మహర్దశ కలిగింది.
- జల్ జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి. తద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.
- రూ.17 లక్షలతో గ్రామంలోని ప్రధాన చెరువులో ర్యాంపులను నిర్మించారు.
- రూ.20 లక్షల జెడ్పీ నిధులతో రక్షిత నీటి పథకం పైప్‌లైన్ విస్తరణ పనులు పూర్తయ్యాయి.



రూ.48 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ భవనం



రూ.22.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే

జగనన్న పాలనలోనే అభివృద్ధి



గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా మా ఊరి అభివృద్ధిని పట్టించుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనే మా గ్రామానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయి. ఫలితంగా గ్రామంలో శాశ్వత అభివృద్ధి పనులు జరిగాయి. ఎప్పటినుంచో ఉన్న రోడ్ల సమస్య పరిష్కారం అయింది. గ్రామంలో మౌలిక వసతులు సమకూరాయి.

మురాల కవిత, రామన్నపేట సర్పంచ్

పెద్ద ఎత్తున అభివృద్ధి



గత ఐదేళ్ల కాలంలో పెద్ద ఎత్తున గ్రామంలో అభివృద్ధి జరిగింది. మా ఊరికి నిధులు మంజూరు చేయించడంతో ఆనాడు మంత్రి జోగి రమేష్ చొరవ మర్చిపోలేము. సీసీ రోడ్ల నిర్మాణానికి, పైప్‌లైన్ నిర్మాణానికి రూ.40 లక్షల జెడ్పీ నిధులు మంజూరు చేయడంతో పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము చొరవ ఎంతో ఉంది. మా ఊరి సమస్య పరిష్కారంలో చొరవ తీసుకున్న నాయకులను మేము గుండెల్లో పెట్టుకుంటాము.

మురాల వెంకటప్పయ్య, పీఏసీఎస్ చైర్మన్

రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి అభినందనీయం

– మేయర్ వెంకటేశ్వరమ్మ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: చారిత్రక మచిలీపట్నంలో అధునాతన హంగులతో రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి అభినందనీయమని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రధాని నరేంద్రమోడీ దేశ వ్యాప్తంగా రూ. 41వేల కోట్లతో 554 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులను 1500 రైల్వే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ మచిలీపట్నం చివరి స్టేషన్‌గా ఉందని ఈ స్టేషన్ రూపురేఖలు మారుస్తూ నూతన స్టేషన్ నిర్మించారని తెలిపారు. రూ. 27 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టారని పేర్కొన్నారు. మచిలీపట్నం చిన్న రైల్వేస్టేషన్ల అభివృద్ధికి రైల్వేశాఖ సన్నద్ధం కావటం హర్షణీయమన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఏడీఎంఎం కె. ప్రకాశరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తొలిదశలో రూ. 270 కోట్ల ఖర్చుతో అనకాపల్లి, భీమవరం, ఏలూరు, కాకినాడ, తాడేపల్లిగూడెం, నరసాపూర్, నిడదవోలు, ఒంగోలు, సింగరాయకొండ, తెనాలి, తుని రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందాయని వెల్లడించారు. రెండో దశలో బాపట్ల, చీరాల, ఆధోని, అనంతపురం, అనపర్తి, కంభం, ధర్మవరం, చిత్తూరు, గుడివాడ, గిద్దలూరు, గుత్తి, ఇమ్మిగనూరు, గుంటూరు, గుణదల, మచిలీపట్నం, మాచర్ల, కడప, మదనపల్లె స్టేషన్లను ఆధునీకరిస్తామని వివరించారు. రైల్వేస్టేషన్ అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మేయర్ వెంకటేశ్వరమ్మ ఆవిష్కరించారు. ఎంయుడీఏ చైర్మన్ బొర్రా దుర్గాభవాని, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మీ, కో–ఆప్షన్ సభ్యులు మట్టా తులసీ, వైఎస్సార్ సీపీ 12వ డివిజన్ ఇన్‌చార్జ్ బందెల థామస్‌నోబుల్, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, తలాటం పద్మావతి, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, అంజనాదేవి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు. తొలుత మేయర్ వెంకటేశ్వరమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం పలువురు కళాకారులు చేసిన కూచిపూడి నృత్యం అలరించింది. నృత్యప్రదర్శన ఇచ్చిన కళాకారులకు, స్కౌట్ విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పూజలు

పెడన: మండల పరిధిలోని ఉప్పలకలువగుంట గ్రామంలో నూతన రామాలయం ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవ పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము), ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాము, హారిక దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వీరితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, రాజులపాటి అచ్యుతరావు తదితర నాయకులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు కానుకల హుండీ లెక్కింపు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీ మంగళవారం ఉదయం 11 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహించే హుండీ లెక్కింపులో ఆసక్తిగల భక్తులు డ్రెస్ కోడ్‌లో పాల్గొనాలని సూచించారు.

కమిషనర్ మృతి బాధాకరం

పెడన: పెడన మున్సిపల్ కమిషనర్ బంటుమిల్లి మహేంద్ర మృతి చాలా బాధకరమని, ఎవరిని నొప్పించకుండా విధులను సక్రమంగా నిర్వహించేవారని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలో మహేంద్ర సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. కమిషనర్ మహేంద్ర అనారోగ్యంతో ఆదివారం ఉదయం చనిపోయిన విషయం విధితమే. మహేంద్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ మున్సిపల్ కార్యాలయంలో సంస్మరణ సభను ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు పలువురు కమిషనర్ గురించి మాట్లాడారు. విధుల పట్ల అంకితభావంతో ఉండేవారని, అటువంటి వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. గంగానమ్మ..



అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో గంగాభవానీ అమ్మవారు

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న గంగాభవానీ అమ్మవారి 12వ పునఃప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకొని మూలమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ చిన్నఅమ్మవారిని బయటకు తీసి విశేష పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావుతో పాటు మరో 15మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి అభిషేకాలు నిర్వహించారు. యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, కోడూరు, తూర్పువైపు గ్రామాలకు చెందిన మహిళలు ఇంటి వద్ద నుంచే బిందెలతో నీటిని తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పండితులు కొమ్మూరి శ్రీనివాసశర్మ యాజ్ఞిక బ్రహ్మగా వ్యవహరించి కార్యక్రమాలను జరిపించారు. మంగళవారం మహా చండీ యాగం, పూర్ణాహుతి, మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు యుగంధరరావు తెలిపారు.

మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మ అమ్మవారి ప్రధాన జాతరను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. మహిళలంతా ఒకేసారి నైవేద్యాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై చిన్నఅమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు శిరస్సుపై గండదీపాలతో చలువ బట్టలపై నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు కర్రసాము, వీరతాడు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దుకాణాల ముందు ఆక్రమణలు తొలగించండి

స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు



దుకాణాల ముందు ఆక్రమణలు తొలగించాలని చెబుతున్న సీఐ నాగేంద్రప్రసాద్

పెడన: పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పెడన, గూడూరు ఎస్ఐలు సూర్యశ్రీనివాస్, వీర్రాజులతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రణాళిక సిబ్బందితో ప్రధాన రహదారి వెంబడి ఉన్న దుకాణాల్లోని యాజమానులను కలిసి పలు సూచనలు చేశారు. వాహనాలను రోడ్డు పక్కన ఎక్కువ సేపు నిలుపుదల లేకుండా చూడాలని, రోడ్డు మీదకు ఎటువంటి సామాన్లు, మార్జిన్లలో ఉంచవద్దని స్పష్టం చేశారు. కొన్ని ఆక్రమణలు తొలగించారు. మరికొన్ని ఆక్రమణలను మంగళవారం సాయంత్రంలోగా తొలగించాలని ఆదేశించారు. ఆ తరువాత పురపాలక సంఘంతో పాటు పోలీస్ శాఖ చేపట్టే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వారికి తెలిపారు. టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి జితేంద్ర తదితరులు కూడా పోలీసులు వెన్నంటే ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



గౌసియాబేగంకు రూ. 2 లక్షల చెక్కును అందజేస్తున్న వెంకటేశ్వరమ్మ, కిట్టు

మచిలీపట్నంటౌన్: ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ముగ్గురు వ్యక్తులకు రూ. 4.5 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి సోమవారం బాధితులకు అందజేశారు. సోమేశ్వరరావుకు రూ.2 లక్షలు, మోషేకు సంబంధించి ఆయన భార్య గౌసియాబేగంకు రూ. 2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. అలాగే మండల పరిధిలోని సీతారామపురానికి చెందిన లుక్కా వెంకటేశ్వరరావుకు రూ. 50 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మీ, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఉరిటి రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి మరింత కృషి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు



సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు



కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు చిత్రంలో మేయర్

కోనేరుసెంటర్: సంక్షేమ పథకాలతో పాటు, గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. బందరు మండలం సుల్తానగరంలో సోమవారం ఆయన పర్యటించి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. అనంతరం కిట్టు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామంలో రూ.91 లక్షల 80 వేల విలువైన రోడ్లు వేశామన్నారు. నాడు నేడు క్రింద గ్రామంలో స్కూల్ అభివృద్ధి చేశామని తెలిపారు. అలాగే రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షల తో రైతు భరోసా కేంద్రం, మరో రూ.20.80 లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభించామని చెప్పారు. ప్రజల సంక్షేమానికి 125 సార్లు బటన్ నొక్కిన జగన్ అన్న కోసం రానున్న ఎన్నికల్లో 2 సార్లు బటన్ నొక్కి ఆయనతో పాటు ఆయన అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. పథకాలతో ప్రజలకు మరింత చేరువవడంతో ఓర్వలేక వైఎస్సార్ సీపీ బ్యానర్‌లను చించి పైశాచిక చర్యలకు ప్రతిపక్షం పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ప్రతిపక్షం ఎన్ని పిల్లి మొగ్గలేసినా వైఎస్సార్ సీపీ గెలుపును అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవి శంకర్, గ్రామ ఇన్‌చార్జి వెంకటేశ్వరావు, కార్పొరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాట తప్పని మడమ తిప్పని నాయకుడు...

మాట తప్పని మడమ తిప్పని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెం, సీతారామపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం, జెడ్పీ నిధులతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు సోమవారం కిట్టు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధితోపాటు సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్న నాయకుడు జగనన్న అన్నారు. రాష్ట్ర ప్రజల మెప్పు పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేక ప్రతిపక్షాలు కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధం అని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి బూటకపు వాగ్దానాలతో వస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, సీతారామపురం సర్పంచ్ కోటిలింగం, ఎస్ ఎన్ గొల్లపాలెం గ్రామ ఇన్చార్జ్ మట్టా నాంచారయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా అడుగులు ...

మచిలీపట్నంటౌన్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలు అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 42, 49, 14 డివిజన్లలో రూ. 50 లక్షలు చొప్పున నిధులతో మూడు కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులకు నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు సోమవారం శంకుస్థాపన చేశారు. 42వ డివిజన్ వడ్డెర సంఘ భవనం, 49వ డివిజన్ భవన నిర్మాణ కార్మికుల భవనం, 14వ డివిజన్‌లో ఎరుకల సంఘ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు నిర్వహించేందుకు అడిగిన వెంటనే రూ. 20 కోట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయటం దీనికి నిదర్శనమన్నారు. ఈ నిధులతో నియోజకవర్గంలో సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మాణంతో పాటు అంబేడ్కర్ భవన్ అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ నగరంలో పలు డివిజన్లలో సంఘాలకు అవసరమైన విధంగా కమ్యూనిటీ హాళ్లు నిర్మించేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించటం పట్లపై జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, 42, 49, 14 డివిజన్ల కార్పొరేటర్లు చీలి రుచిత, పల్లి శేఖర్, కాగిత జవహర్‌లాల్‌నెహ్రూ, పలు డివిజన్ల కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిలక్ష్మి విగ్రహ ప్రతిష్ట



యాగశాలలోకి ప్రవేశం చేస్తున్న ఆదిలక్ష్మి విగ్రహం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని భోగాది అచ్చిరెడ్డి ముఠా ఆధ్వర్యంలో భోగాది అప్పారాయుడు స్థలంలో నిర్మించిన దేవాలయంలో ఆదిలక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. యాగ్నిక బ్రహ్మ కె.రమణాచార్యులు బ్రహ్మత్వంలో ప్రతిష్ఠా పూజా క్రతువులో భోగాది వెంకట శేషగిరిరావు– ఝాన్సీరాణి, నాగమల్లికార్జునరావు–పద్మ, అప్పారాయుడు– వెంకటశిరీష దంపతులు పీటలపై కూర్చున్నారు. రుత్విక్కుల వేద మంత్రోశ్చరణలతో ఉదయం 7 గంటలకు విగ్రహం యాగశాల ప్రవేశం, నిత్య హోమాలు, మహా పూర్ణాహుతి దేవార్చనలు చేశారు. చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఆదిలక్ష్మి అమ్మవారి యంత్ర స్థాపన, నూతన శిల విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. తదుపరి మంగళాశాసనం, మహా వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ చేసారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త పుషడపు నిరంజనరావు, అచ్చిరెడ్డి ముఠా పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రొయ్యల సాగుపై మత్స్య సాగుబడి



అవగాహన కల్పిస్తున్న సునీత

కమ్మనమోలు(నాగాయలంక): వెనామీ రొయ్యల సాగులో ప్రోబయోటిక్స్ వినియోగం వలన ఆక్వా రైతాంగానికి విస్తృత ప్రయోజనాలు చేకూరుతాయని అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు ఆర్.ప్రతిభ తెలిపారు. మండలంలోని కమ్మనమోలు, భావదేవరపల్లి ప్రాంతాల్లో సోమవారం ఆక్వా రైతులకు మత్స్య సాగుబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనామీ సాగులో ప్రోబయోటిక్స్ వినియోగం, పీతల పెంపకంలో మెలకువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అవనిగడ్డలోని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో మట్టి, నీటి పరీక్షలు చేస్తున్నందున ఆక్వా రైతులు సద్వినియోగం చేసకుని సత్ఫలితాలు పొందాలని సూచించారు. మత్స్య అభివృద్ధి అధికారి తూములూరి సునీత, ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్ ఎ.చంద్రశేఖర్, వీఎఫ్ఏలు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ: ఆర్టీసీ డిపో కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ కె.హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి 12 గంటల మధ్య నిర్వహించే కార్యక్రమంలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు 9959225466 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.